


5న సివిల్ సర్వీస్ కోచింగ్‌కు ఎంపిక పరీక్ష

శ్రీకాకుళం సిటీ: విజయవాడ బిసి సర్కిల్ ఆధ్వర్యాన సివిల్ సర్వీస్ శిక్షణ స్క్రీనింగ్ పరీక్షకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా బిసిసంక్షేమశాఖ అధికారి ఇ.అనురాధ ప్రకటనలో తెలిపారు. డిసెంబరు 5న ఎంపికకు స్క్రీనింగ్ పరీక్ష నిర్వహించనున్నట్లు చెప్పారు. పట్టణంలోని 80 అడుగుల రోడ్డు సమీపంలో ఉన్న బిసి సర్కిల్ కార్యాలయంలో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఈ నెల 17 నుంచి 25వ మధ్య దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. స్క్రీనింగ్ పరీక్ష నిర్వహించి అర్హత సాధించిన వారికి 10 నుంచి బిసి స్టడీ సర్కిల్ ఆధ్వర్యాన విజయవాడలో శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. దరఖాస్తులో 10వ తరగతి, ఇంటర్మీడియట్, డిగ్రీ, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, ఆధార్ కార్డు, రెం డు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలతో దరఖాస్తులు చేసుకోవాలని చెప్పారు. వివరాలకు ఫోన్ నంబర్లు 7382975679, 8332852106 సప్రదించాలని అన్నారు.

ఉత్తరాంధ్ర ఉద్యమాల్లో కవుల పాత్ర కీలకం

పూర్వ ఎమ్మెల్సీ ఎం.వి.ఎస్ శర్మ



పుస్తకం చదువుతున్న ఎం.వి.ఎస్.శర్మ, గోవిందరావు

ప్రజాశక్తి- అరసవల్లి

ఉత్తరాంధ్ర ఉద్యమంలో పోరాటాలకు అనేక మంది కవులు తమ పాటలు, కవితలు, సాహిత్యంతో చైతన్యం తెచ్చారని పూర్వ ఎమ్మెల్సీ ఎం.వి.ఎస్.శర్మ అన్నారు. నగరంలో ఎన్‌టిఆర్ మున్సిపల్ మైదానంలో నిర్వహిస్తున్న సిక్కోలు పుస్తక మహోత్సవంలో రచయిత అట్టాడ అప్పలనాయుడు అధ్యక్షత కాళీపట్నం రామారావు సాహిత్య వేదికపై కళింగాంధ్ర కవిత అంశంపై చర్చ, సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్, బాక్సైట్ ఉద్యమం పోరాటంలో కవుల పాత్ర ఎంతో ఉందని అన్నారు. సిక్కోలు పుస్తక కమిటీ ఆధ్వర్యాన పుస్తకం మహోత్సవం ఏర్పాటు చేసి ముందుగా సంక్రాతి పండగ వాతావరణం తీసుకొచ్చారని అన్నారు. రచయత బడాన శ్యామలరావు మాట్లాడుతూ పద్యకవితకు ఉత్తరాంధ్రలో ప్రాధాన్యత ఉందని తెలిపారు. ఉత్తరాంధ్రలో పటిమ చెందిన పద్యకవులు ఉన్నారని పేర్కొన్నారు. రచయిత సుధాకర్‌మౌళి మాట్లాడుతూ శ్రీశ్రీ తరువాత అనేక ప్రాంతాల్లో దళితులపై జరిగిన దాడులు ప్రభావంతో వారిలో చైతన్యవంతమైన కవితా సాహిత్యం వచ్చిందని అన్నారు. వెంపటాపు సత్యం, భూషణం మాస్టారు, వంగ పండు లాంటి వారు సామాజిక విప్లవం సాహిత్య చైతన్యం తెచ్చారని తెలిపారు. రచయత చింతాడ తిరుమలరావు మాట్లాడుతూ ఆధునిక కవిత్వానికి గురజాడ సాహిత్య జాడగా కవులందరికీ మార్గదర్శకులు అయ్యారన్నారు. గరిమెల్ల సత్యనారాయణ స్వాతంత్ర ఉద్యమానికి చైతన్యపరచడాని గేయాలు రాసి ప్రజల్లో దేశభక్తి రగిలించారని అన్నారు. అనంతరం విశాఖ రచయితలు రచించిన సంకలనం 'తిమిరాన్ని తరిమివేద్దాం' పుస్తకాన్ని ఆవిష్కరించారు. రచయత లండ సాంబమూర్తి రచించిన 'ఆమెకు మిగలని ఆమె' పుస్తకాన్ని రచయత ఉదయకిరణ్ పరిచయం చేశారు. రచయత పాయల మురళీకృష్ణ రచించిన సంకలనం గచ్చేం సెట్టుకి అటూ ఇటూ అనే పుస్తకం లండ సాంబమూర్తి పరిచయం చేశారు. అనంతరం జంధ్యాల శరత్‌బాబు, లండ సాంబమూర్తి, కలమట దాసుబాబు, గేదెల నీలయ్య, కె.ఎ.రాములు, ఆర్.ఢిల్లీ తదితరులు కవిసమ్మేళనంలో పాల్గొన్నారు. 'మహోత్సవం మహోత్సవం.. పుస్తక మహోత్సవం... సిక్కోలు పుస్తక మహోత్సవం రారండీ, రారండీ' అంటూ ఉపాధ్యాయుని వేధవతి పాట పాడి వినిపించారు.



పుస్తక ప్రదర్శనను తిలకిస్తున్న సందర్శకులు



మాట్లాడుతున్న పూర్వ ఎమ్మెల్సీ ఎం.వి.ఎస్ శర్మ



నృత్య ప్రదర్శన చేస్తున్న కళాకారులు



మ్యాజిక్ షో నిర్వహిస్తున్న బాల బాయన్న

ఎస్‌పి సందర్శన

సిక్కోలు పుస్తక మహోత్సవాన్ని ఎస్‌పి కె.వి.మహేశ్వర రెడ్డి శనివారం సందర్శించారు. శ్రీకుళంలో ఇంత పెద్ద మొత్తంలో పుస్తకాల సమాహారం అందుబాటులో ఉండటం చూసి ఆనందం వ్యక్తం చేశారు. విభిన్న ప్రచురణకర్తల నుంచి వచ్చిన పుస్తకాల వైవిధ్యాన్ని పరిశీలించి, స్వయంగా కొన్ని పుస్తకాలను కొనుగోలు చేశారు. పుస్తక మహోత్సవంలో జరుగుతున్న సాహిత్య-సాంస్కృతిక కార్యక్రమాలు, జెవివి విజ్ఞాన కార్యక్రమాల గురించి నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. టెలిస్కోప్ ద్వారా సూర్యుని బ్లాక్ స్పాట్స్‌ను వీక్షించడం, ఉత్తరాంధ్ర ప్రముఖుల ఫొటో గ్యాలరీను చూడడం ఆయనకు ప్రత్యేక అనుభూతినిచ్చాయి. ఆయన నిర్వాహకులను అభినందించి, పుస్తక మహోత్సవాన్ని విజయవంతంగా నిర్వహిస్తున్నందుకు తన శుభాకాంక్షలు తెలిపారు. కె.లక్ష్మయ్య, శ్రీనివాస్, కిరణ్ సిక్కోలు పుస్తక మహోత్సవం ముఖ్య ఉద్దేశం, థీమ్ గురించి ఎస్‌పికి వివరించారు.



పుస్తకం చదువుతున్న ఎస్‌పి మహేశ్వర రెడ్డి

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

శివ జోష్ ఆధ్వర్యాన నిర్వహించిన నృత్యాలు, గార్ల వెంకట రావు ఎరుకుల పాట, గజల్ వాసుదేవరావు గేయాలు ఎంతగానో అలరించాయి. మరోపక్క వైజ్ఞానిక ప్రదర్శనలు కడపకు చెందిన జెవివి ప్రతినిధి బాల బాయన్న పేపర్ మ్యాజిక్, వాటర్ మ్యాజిక్, గురూత్వాకర్షణ శక్తి వంటి అంశాలు చూపించారు. పాఠశాల, కళాశాల విద్యార్థులు ఎంతో ఆసక్తితో సైన్స్ ప్రదర్శనలు తిలకించారు. కుప్పిలి కామేశ్వరరావు సైన్స్-సమాజాభివృద్ధిపై విశ్లేషణ చేశారు.

నేటి కార్యక్రమాలు

సాయంత్రం 4 గంటలకు సైన్స్ వైజ్ఞానిక కార్యక్రమాలు జన విజ్ఞాన వేదిక ఆర్గనైజర్ పి.వేణుగోపాల్ ఆధ్వర్యాన వచ్చే సైన్సు పరిశోధనలు, ఆవశ్యకత కడపకు చెందిన బాల భాయన్న ఆధ్వర్యాన మ్యాజిక్ షో ఉన్నాయి. 5 గంటలకు సాహిత్య కార్యక్రమాలు, కళింగాంధ్ర చరిత్రలో మహిళ, ఆదివాసీ దళిత ఆవరణాలు' చర్చ గోష్టి సమావేశం. అనంతరం 'పెయిన్స్ గ్రేయిన్స్' అడవి పూల దారిలో పుస్తక ఆవిష్కరణలు. కవి సమ్మేళనం ఉంటుంది. జానపద గేయాలు, గజల్స్ గీతాలు ఆలాపన, కళాశాల విద్యార్థులతో నృత్యాలు ఉన్నాయి.

పచ్చదనం, పరిశుభ్రతకు ప్రాధాన్యం

కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ప్రజాశక్తి- నరసన్నపేట

గ్రామాల్లో పచ్చదనం పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ స్వప్నల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. మండలంలోని జమ్ములో శనివారం నిర్వహించిన స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో పాల్గొన్నారు. ముందుగా అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పచ్చదనం ప్రాముఖ్యత, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. గ్రామంలో ప్రతి ఇంట్లో తడి చెత్త పొడి చెత్త వేరు చేసి వాటిని చెత్త సంపద తయారీ కేంద్రాలకు చేరే విధంగా కృషి చేయాలని సూచించారు. చెత్త సంపద తయారీ కేంద్రాల నుంచి వర్మీకంపోస్టు ఎరువు తయారు చేసి వాటిని వాడే విధంగా రైతులకు అవగాహన కల్పించాలని అధికారులకు ఆదేశించారు. అనంతరం గ్రామంలోని చెత్త సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో డిపిఒ రామారావు, ఎంపిడిఒ వెంకటెశ్వరప్రసాద్, తహశీల్దార్ సత్యనారాయణ, టిడిపి నియోజకవర్గ సమన్వయకర్త బగ్గు అర్చన, ఇఒ ద్రాక్షాయిని, ఎడిఎ ఎల్.వి.మదు, టిడిపి నాయకులు సాసుపల్లి కృష్ణబాబు, చంద్రశేఖర్, జి.చిట్టిబాబు, జామి వెంకటరావు పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

క్రమశిక్షణ, సమర్థతతో పనిచేయాలి

ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

కోర్టు కానిస్టేబుళ్లు క్రమశిక్షణ, సమర్థతతో పనిచేయాలని జిల్లా ఎస్‌పి కె.వి.మహేశ్వరరెడ్డి అన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో శనివారం కేసుల విచారణలో కోర్టు సంబంధిత వ్యవహారాలు వేగవంతం, కేసుల ఛార్జ్ షీట్స్ దాఖలో లోపాలు లేకుండా చూడడం, నిందితుల హాజరు, సమన్లు, వారెంట్ల అమలు వంటి అంశాలపై సమగ్రంగా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్ణీత సమయంలో ముఖ్యమైన కేసుల ఛార్జ్ షీట్‌లను కోర్టులో దాఖలు చేయాలన్నారు. కేసుల విచారణ సమయంలో సాక్షులు హాజరుపరచడం, పబ్లిక్ ప్రాసిక్యూటర్లతో సమన్వయం ముఖ్యమని అన్నారు. శిక్షల శాతం పెరిగేలా కోర్టు కానిస్టేబుళ్లు కృషి చేయాలని, కేసుల రికార్డులను సక్రమంగా నిర్వహించడం కోర్టు కానిస్టేబుల్ బాధ్యత అని పేర్కొన్నారు. రిఫర్ కేసులపై ప్రత్యేక దృష్టి సారించి, కోర్టు ప్రక్రియలు సకాలంలో పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలని సూచించారు. సమన్లు, వారెంట్ల అమల్లో ఆలస్యం జరగకుండా, నిందితుల కోర్టు హాజరు విషయంలో క్రమశిక్షణ, సమర్థతతో వ్యవహరించాలని ఎస్‌పి దిశానిర్దేశం చేశారు. సమీక్షలో డిసిఆర్‌బి సిఐ శ్రీనివాస్ పాల్గొన్నారు.

పారిశ్రామికవేత్తలకు రాయితీలు... రైతులకు కోతలా?



ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి

విశాఖలో పెట్టుబడుల సదస్సులో పేరుతో పారిశ్రామిక వేత్తలకు రాయితీలు, ఇతర ఏ సౌకర్యాలు కోరుకుంటే అవి ఇచ్చేందుకు సిద్ధమైపోతున్న ప్రభుత్వం రైతుల విషయంలో మాత్రం భిన్నంగా వ్యవహరిస్తోంది. పంట నష్ట పరిహారానికి సంబంధించిన ఆంక్షలను మాత్రం తొలగించడానికి ఏ మాత్రం ఇష్టం పడటం లేదు. మొంథా తుపాను ప్రభావంతో ఇటీవల కురిసిన వర్షాలకు వేలాది ఎకరాల్లో వరి పంట దెబ్బతింది. సరిగ్గా పంట చేతికొచ్చే సమయంలో వర్షాలు కురవడంతో పలు జిల్లాలో నాలుగైదు రోజులు పాటు నీటిలోనే వరి చేలు ఉండిపోయింది. పంట నష్టపరిహారం కింద తమకు డబ్బులు వస్తాయని భావించిన రైతులకు ప్రభుత్వ నిరాశనే మిగిల్చింది. ఎప్పటి మాదిరిగానే 33 శాతం పైగా దెబ్బతిన్న పంటలకే నష్టం ఇచ్చే నిబంధనను అమలు చేసి రైతులకు మొండి చేయి చూపింది. కనీసం ఒక్క శాతం తక్కువైనా లెక్కించలేదు. ఆరు గాలం శ్రమించి ప్రకృతి వైపరీత్యాలతో నష్టపోయిన రైతుల విషయంలో ప్రభుత్వం మినహాయింపులు ఇచ్చేందుకు ఏ మాత్రం ఇష్టపడటం లేదు. ప్రభుత్వం నష్టపరిహారం ఇవ్వకపోయినా కనీసం ఉన్నంత మేరకు ధాన్యం అమ్ముకుందామన్నా దానికీ రైతులకు అవకాశం లేకుండా పోయింది. ధాన్యం కొనుగోలు విషయంలోనూ నిబంధనలను సవరించడానికి అంగీకరించడం లేదు. ధాన్యంలో 17 శాతం తేమ ఉంటేనే తీసుకుంటామని చెప్తోంది. వర్షాలకు ధాన్యం తడిచిపోవడంతో ధాన్యంలో బాగా తేమ శాతం ఎక్కువగా ఉందని రైతులు చెప్తున్నారు. కొనుగోలు కేంద్రాలకు రైతులు నాణ్యమైన ధాన్యం తీసుకొస్తేనే తీసుకుంటామని చెప్తోంది. వర్షాలు పడటంతో ధాన్యం రంగు మారుతోందన్న ఆందోళన లో ఉన్న రైతులకు ఉపశమనం ఇచ్చేందుకూ ప్రభుత్వం ఇష్టపడటం లేదు.

మొంథా తుపాను ప్రభావంతో జిల్లాలో వరి పంటకు సంబంధించి 4,801 మంది రైతులకు చెందిన 5,568.75 ఎకరాల్లో వరి పంట దెబ్బతిన్నట్లు అధికారులు ప్రాథమికంగా గుర్తించి తర్వాత ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం దానిని 4,234.33 ఎకరాలకు కుదించారు. మొంథా తుపాను ప్రభావంతో భారీ వర్షాలు కురవడంతో పల్లపు ప్రాంతాల్లో నేటికీ నీటిలోనే వరి చేలు ఉండిపోయింది. మరోవైపు ఈదురుగాలుల తీవ్రతకు పంట వాలిపోవడంతో కోసేందుకు సాధ్యపడటం లేదు. 33 శాతం నిబంధనతో పరిహారం జాబితాలోనూ చోటు దక్కలేదు. పంట కోతకు భారీగా కూలీ డబ్బులు అడుగుతుండటంతో కోతలకు రైతులు వెనకడుగు వేస్తున్నారు. కోతల కోసం కొన్ని ప్రాంతాల్లో ఎకరా పొలానికి కోతకు రూ.5 వేలు అడుగుతున్న పరిస్థితి ఉంది. కొన్నిచోట్ల రోజుకు రూ.500 కూలీ, ఒక పూట భోజనం, రానుపోను ఆటో ఛార్జీలు అడుగుతుండటంతో ధాన్యం వచ్చినా గిట్టుబాటు అవుతుందో లేదోనని రైతులు పొలాల్లోనే పంట వదిలేస్తున్న పరిస్థితి నెలకొంది. వరితో పాటు ఇతర పంటలు పండించిన రైతులకూ కన్నీరే మిగిలింది. పత్తి, మొక్కజొన్న, చెరకు కూరగాయల పంటలకు సంబంధించి నామమాత్రం నష్టమే జరిగినట్లు నివేదించారు. ప్రాథమిక నివేదికలో 1.12 ఎకరాల్లో అరటి, ఎకరా విస్తీర్ణంలో బొప్పాయి పంట దెబ్బతిన్నట్లు పేర్కొన్నా తుది జాబితాలో సున్నాగా నమోదు చేశారు. పంట నష్టం నమోదు విషయంలో సాధ్యమైనంత మేర రైతులకు మేలు చేసేలా నిర్ణయం తీసుకోవాల్సిన ప్రభుత్వం 33 శాతం నిబంధనను అమలు చేయడం ద్వారా వారిపై ప్రభుత్వానికి ఉన్న ప్రేమ ఏమిటో తేటతెల్లమవుతోంది.

పారిశ్రామిక వేత్తలు, పెట్టుబడిదారులకు సాగిలపడుతున్న ప్రభుత్వం చివరకు రైతులను సైతం లెక్క చేయడం లేదు. పరిశ్రమలు, ఎయిర్‌పోర్టులు, పవర్‌ప్లాంట్లు కోసం రైతుల నుంచి బలవంతంగా భూమిని సేకరించేందుకు సైతం సిద్ధమవు తోంది. మందస కార్గో ఎయిర్ పోర్టు విషయంలో ప్రభుత్వం ఇలానే వ్యవహరిస్తోంది. తమ ప్రాంతంలో ఎయిర్‌పోర్టు వద్దని, తాము భూములు ఇచ్చేది లేదని తేల్చి చెప్తున్నా రెవెన్యూ అధికారులు మరో పక్క గ్రామాల్లోకి వెళ్లి సర్వేకు ఉపక్రమిస్తున్నారు. ఇటీవల మందస ఎయిర్‌పోర్టు ప్రభావిత గ్రామాల్లో భూముల సర్వేకు వెళ్లిన అధికారులను స్థానికులు అడ్డుకున్న సంగతి తెలిసిందే. బలవంతపు భూముల సేకరణ, ఎయిర్‌పోర్టు వద్దంటూ ప్రభావిత గ్రామాల ప్రజల ఆందోళనలను సైతం అడ్డుకునేందుకు ప్రయత్నిస్తోంది. బూర్జ-సరుబుజ్జిలి ప్రాంతంలో ప్రతిపాదిత థర్మల్ పవర్ ప్లాంట్‌కు వ్యతిరేకంగా ధర్నాకు వెళ్తున్న గిరిజనులపై ప్రభుత్వం వ్యవహరించిన తీరు మనం చూశాం. గిరిజన గ్రామాలను దిగ్బంధించి ఎక్కడికక్కడ అడ్డుకుంటూ ధర్నాకు వెళ్లనీయకుండా ఆంక్షలు విధించింది. రైతు ప్రభుత్వం, గిరిజనుల సంక్షేమం అంటూ ఒక పక్క చెప్తున్న ప్రభుత్వం ఎవరి ప్రయోజనాల కోసం పనిచేస్తోందో ప్రత్యేకించి చెప్పాల్సిన అవసరం లేదు.


వినతిపత్రం అందజేస్తున్న సిఐటియు నాయకులు


అంగన్వాడీ కేంద్రాల విలీనం ఆపాలి

ప్రజాశక్తి- నరసన్నపేట

అంగన్వాడీ కేంద్రాలను ప్రీ స్కూల్ పిల్లలతో బలోపేతానికి చర్యలు తీసుకోవాలని, అంగన్వాడీ సెంటర్లు ప్రభుత్వ పాఠశాలల్లో విలీనం ఆపాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్.అమ్మన్నాయుడు, జిల్లా కోశాధికారి అల్లు సత్యనారాయణ ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. అంగన్వాడీ కేంద్రాలు బలోపేతానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరుతూ పోలాకి రోడ్‌లో గల నరసన్నపేట గ్రామ సచివాలయలో శనివారం సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాల్లో ప్రీస్కూల్ పిల్లలు తగ్గిపోతున్నారని, ఈ కారణం చూపి అంగన్వాడీ సెంటర్లను విలీనం చేయాలని ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తుందని అన్నారు. అంగన్వాడీ సెంటర్లలో ప్రీస్కూల్ బలోపేతం చేయాలంటే మూడు నుంచి ఆరేళ్లలోపు పిల్లలను రాష్ట్రవ్యాప్తంగా అంగన్వాడీ కేంద్రాల్లో నమోదయ్యేవిధంగా చూడాలని అంగన్వాడీ కేంద్రాల్లోనే ఉండే విధంగా జిఒ ఇవ్వాలన్నారు. ప్రీస్కూల్ పిల్లలకు తల్లికి వందనం అమలు చేయాలన్నారు. మెనూ క్వాంటిటీని పెంచాలని, ప్రీస్కూల్ పిల్లలకు యూనిఫామ్, టై, బెల్ట్, బూట్లు ఇవ్వాలని అన్నారు. అంగన్వాడీ పిల్లలకు ఇచ్చే మెనూ, బియ్యం 75 గ్రాములు, పప్పు 15 గ్రాములు, ఆయిల్ ఐదు గ్రాములు మాత్రమే ఇస్తున్నారని పేర్కొన్నారు. అందుకు క్వాంటిటీని పెంచాలని డిమాండ్ చేశారు. ప్రీస్కూల్ పిల్లలకు గుడ్లు, పాలు, భోజనం, ఉదయం 12.30 గంటలకే పూర్తి అవుతుందని తెలిపారు. పిల్లలందరూ సాయంత్రం 4 గంటల వరకు కేంద్రాల్లోనే ఉంటున్నారని, ఈ సమయంలో స్నాక్స్ అందించాలని అన్నారు. ఎఫ్‌ఆర్ఎస్ రద్దు చేయాలన్నారు. నరసన్నపేటలో పాతబడిన కేంద్రాల్లో అంగన్వాడీలు ఉన్నాయని, సొంత భవనాలు నిర్మించాలని అన్నారు. కార్యక్రమంలో ఎపి అంగన్వాడీ కేంద్రాల యూనియన్ నరసన్నపేట ప్రాజెక్టు ప్రధాన కార్యదర్శి పట్ట భాగలక్ష్మి, కె.రాంబాయమ్మ, జి.హేమ తదితరులు పాల్గొన్నారు.

పరీక్షలపై చులకనభావం తగదు

నరసన్నపేట: ఒకటో తరగతి నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు సంగ్రహణాత్మక పరీక్షలు నిర్వహిస్తున్న తరుణంలో స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర కార్యక్రమం నిర్వహించమని ఆదేశాలు జారీ చేయడంలో అర్థం లేదని శ్రీకాకుళం ఫ్యాప్టో ఒక ప్రకటనలో ఖండించారు. శనివారం నరసన్నపేట కేంద్రంలో బమ్మిడి శ్రీరామ్మూర్తి, పడాల ప్రతాప్‌కుమార్ విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఒకవైపు సీరియస్‌గా ఉదయం 9.15 నుంచి సాయంత్రం 4.15 నిమిషాల వరకు పరీక్షలు నిర్వహిస్తుండగా... స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా వ్యక్తిగత సామాజిక పరిశుభ్రత, బహిరంగ మలవిసర్జన నివారణ, సామాజిక పరిశుభ్రతకు పారిశుధ్య కార్యక్రమాలు, చేతుల కడుగుట ప్రతిజ్ఞ వంటివి పరీక్ష మధ్యలో చేయించాలని అన్నారు. రాష్ట్ర జిల్లా, మండల విద్యాశాఖ అధికారులు వాట్సాప్ మెసేజెస్ పెట్టడం యాప్‌లో అప్‌లోడ్ చేయమనడం సమంజసం కాదని అన్నారు. శనివారం సైన్స్ పరీక్షలు నిర్వహిస్తుండగా మధ్యలో ఇటువంటి బోధనేతర కార్యక్రమాలు నిర్వహించడం వల్ల విద్యార్థులకు పరీక్షలంటే చులకన భావన ఏర్పడుతుందని పేర్కొన్నారు. అలాగే తల్లిదండ్రులకు ప్రభుత్వ పాఠశాలలపై నమ్మకం పోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఉపాధ్యాయులు ఫ్యాప్టో ఇచ్చిన పిలుపు మేరకు బోధనేతర కార్యక్రమాలను బహిష్కరణ చేయాలని తెలిపారు. ప్రకటన విడుదల చేసిన వారిలో ఎం.మదనమోహన్, పూజారి హరిప్రసన్న, బి.వెంకటేశ్వర్లు, జి.వి.రమణ, వి.సత్యనారాయణ, జి.జగన్మోహనరావు, ఎల్.బాబూరావు, ఎస్.అనిల్‌కుమార్, రవి, ఎస్.వి.రమణ, వాసుదేవరావు, కృష్ణారావు, పూర్ణిమ పాల్గొన్నారు.


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కిరణ్‌కుమార్

రైలులో ఓట్ చోరీపై ప్రచారం

కంచిలి: శ్రీకాకుళం జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు డాక్టర్ పూడి కిరణ్ కుమార్ ఆధ్వర్యాన ఓట్ చోర్-గద్దె చోడ్ అనే నినాదంతో శనివారం కంచిలి రైల్వేస్టేషన్ వద్ద విశాఖ ఇంటర్సిటీ ఎక్స్‌ప్రెస్ రైలులో ప్రయాణికులకు పోస్టర్లను పంచిపెట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాహుల్‌గాంధీ ఓటు చోరీపై బీహార్, హర్యానా రాష్ట్రాల్లో ఆధారాలతో చెప్పారరని అన్నారు. మొదటి నుంచి బీహార్ ఎన్నికలు అక్రమాల పుట్టగానే ఉందని, దానికి నిదర్శనం బీహార్‌లో తాజా ఎన్నికల ఫలితాలని అన్నారు. బిజెపి, ఎలక్షన్ కమిషన్ చేస్తున్న ఓట్ చోరీ మోసాన్ని ప్రజలు క్షమించరన్నారు. మా పోరాటం రాజ్యాంగం ప్రజాస్వామ్యాన్ని రక్షించడం కోసమే అన్నారు. ఈ నెల 21న విజయవాడలో ఎపి ఎలక్షన్ కమిషన్ కార్యాలయం ముందు ఓట్ చోరీపై ఆందోళన చేపడుతున్నామని తెలిపారు. అందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. అనంతరం ప్రయాణికులతో కలిసి పోస్టర్లను ఆవిష్కరించారు.

గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన


లావేరు: పుస్తక ప్రదర్శన నిర్వహిస్తున్న గ్రంథాలయాధికారి తదితరులు

ప్రజాశక్తి- లావేరు

58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా శనివారం స్థానిక శాఖా గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన నిర్వహించారు. జెడ్‌పిహెచ్ స్కూల్ పీడీ పి.సుదర్శన్ పుస్తక ప్రదర్శన ప్రారంభించి విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. ప్రతి విద్యార్థి ప్రతి పుస్తకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ ప్రదర్శనలో రామాయణం, మహాభారతం, భగవద్గీత, విష్ణు పురాణం, పద్మ పురాణం, ఖురాన్, చరిత్ర, సైన్స్, బాలసాహిత్యంతో పాటు సుమారు 400 పుస్తకాల ప్రదర్శనలో ఉంచారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి మురపాక శ్రీనివాసరావు, సహాయకులు టి.వీరభద్రుడు, విద్యార్థులు పాల్గొన్నారు.

బూర్జ: స్థానిక శాఖా గ్రంథాలయంలో వారోత్సవాలు సందర్భంగా పుస్తక ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో జూనియర్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ పి.శశిధర్ అన్నారు. తెలుగు కామర్స్ లెక్చరర్లు ఢిల్లీశ్వరరావు, రాజశేఖర్‌తో పాటు గ్రంథాలయాధికారి కె.సునీత, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆమదాలవలస: గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా పట్టణంలోని బొడ్డేపల్లిపేట శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయాధికారి అన్నెపు కోటేశ్వరరావు ఆధ్వర్యంలో పాటల పోటాలు నిర్వహించారు. ఈ పోటీల్లో వివిధ పాఠశాలలకు చెందిన 35 మంది విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో అంపోలు సూర్యారావు, తమ్మినేని సూర్యనారాయణ, విద్యార్థులు పాల్గొన్నారు.

మెళియాపుట్టి: మండల కేంద్రంలోని స్థానిక శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయ వారోత్సవాల రెండో రోజు కార్యక్రమంగా శనివారం పుస్తక ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ రంగాలకు చెందిన పుస్తకాలను ప్రజలకు పరిచయం చేస్తూ వాటి ప్రాముఖ్యతను నిర్వాహకులు వివరించారు. కార్యక్రమానికి ప్రధాన అతిథులుగా హాజరైన ఎంపిడిఒ నరసింహ ప్రసాద్ పండా, ఎంఇఒ ఎం.పద్మనాభరావు, నలంద పబ్లిక్ స్కూల్ ప్రిన్సిపాల్ జె.జె.ప్రతాప్ పాల్గొని ప్రదర్శనను సందర్శించారు. గ్రంథాలయ అధికారి ఆర్.అనురాధ పుస్తకాల ప్రాముఖ్యతను వివరించారు. స్థానిక ప్రజలు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో ప్రదర్శనను వీక్షించారు. గ్రంథాలయ వారోత్సవాల భాగంగా మరిన్ని కార్యక్రమాలు రాబోయే రోజుల్లో నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

పోలాకి: శాఖాగ్రంథాలయంలో గ్రంథాలయ అధికారిణి కె.మానస ఆధ్వర్యాన పుస్తక పఠనం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపిటిసి ప్రతినిధి తులుగు అశోక్‌కుమార్, ఎన్.వల్లభనాయుడు పాల్గొన్నారు.

టెక్కలి : గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా స్థానిక గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన నిర్వహించారు. ఎంఇఒ దల్లి తులసీరావురెడ్డి, దాసుపురం చిన్నారావు ప్రారంభించారు. గ్రంథాలయ అధికారి బి.రూపావతి ఆధ్వర్యాన నిర్వహించిన కార్యక్రమంలో భాగంగా వివిధ పోటీ పరీక్షలకు అవసరమైన పుస్తకాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారిని బి.రూపావతి, సహాయకులు అమ్మన్నమ్మ, పాఠకులు పాల్గొన్నారు.

పలాస : ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జె. వెంకటలక్ష్మి పుస్తక ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి బి.నరసింహులు, డాక్టర్ వై వెంకటలక్ష్మి, ఐక్యూఎసి కో-ఆర్డినేటర్ పి.వెంకట రమణ, సైన్స్ విభాగాధ్యక్షులు ఎన్.శ్రీనివాస్ పట్నాయక్ పాల్గొన్నారు.


బూర్జ : గ్రంథాలయంలో నిర్వహిస్తున్న పుస్తక ప్రదర్శన

కొత్తూరు: స్థానిక శాఖాగ్రంథాలయంలో గ్రంథాలయాధికారి టి.ఇందిరా ఆధ్వర్యాన పుస్తక ప్రదర్శన నిర్వహించారు. ప్రభుత్వ ప్రాథమిక విద్యార్థులతో డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు పెద్ద ఎత్తున పుస్తక ప్రదర్శన తిలకించారు. కార్యక్రమంలో ఎంపిటిసి ప్రతినిధి టి.తిరుపతిరావు, ఉపాధ్యాయులు పి.రామచంద్రరావు, గున్నయ్య, జి.జానకిరామ్ పాల్గొన్నారు.

నందిగాం: శాఖాగ్రంథాలయం నందిగాంలో గ్రంథాలయ అధికారి ఎస్.ఉదయ్ కిరణ్ ఆధ్వర్యాన పుస్తక ప్రదర్శన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా మేజర్ పంచాయతీ కార్యదర్శి శ్రీధర్ టిడిపి నాయకులు మదన్ గౌడ్, మట్టా భవనకుమార్, వీరభద్రం పాల్గొన్నారు. ముందుగా సరస్వతీదేవి చిత్ర పటానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. గ్రంథాలయాధికారి ఎస్.ఉదయ్‌కిరణ్ తొలిత విద్యార్థులతో స్వచ్ఛ ఆంధ్రా-స్వర్ణాంధ్ర ప్రతిజ్ఞ చేయించి పరిసరాలు పరిశుభ్రంగా చేశారు. గ్రంథాలయ సహాయకురాలు రాములమ్మ పాల్గొన్నారు.


ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రవికుమార్

దళారీ వ్యవస్థ నిర్మూలనే లక్ష్యం

ప్రజాశక్తి- పొందూరు

దళారీ వ్యవస్థను నిర్మూలించి రైతుకు గిట్టుబాటు ధరను అందించాలన్న లక్ష్యంతోనే ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తున్నదని ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. మండల కేంద్రంలో రెవెన్యూ, సహకార రంగం, వ్యవసాయ శాఖ సంయుక్తంగా పొందూరు రైతుసేవా కేంద్రం-1 పరిధిలో మట్టిమిత్రులు ఆధ్వర్యంలో శనివారం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరుగాలం శ్రమించి రైతులు పండించిన పంటలను దళారీలకు అమ్మకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో విక్రయించాలన్నారు. మండలంలోని మొత్తం 12 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి వాటిద్వారా సుమారు 9 వేల టన్నుల ధాన్యాన్ని సేకరించడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఎఒ ఎం.శ్రీనివాసబాబు అన్నారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు చిగిలిపల్లి రామ్మోహన్, పిఎసిఎస్ అధ్యక్షులు వండాన మురళీ, తహశీల్దార్ వెంకటేష్, ఎంపిడిఒ వాసుదేవరావు, పిఎసిఎస్ సిఇఒ ఎర్నేన పాపినాయుడు, కూటమి నాయకులు సీపాన శ్రీరంగనాయకులు, అన్నెపు రాము, బలగ శంకర భాస్కరరావు, బాడాన శేషగిరి, గాడు నారాయణరావు, చిన్నరంగా, ఇఒ మోహన్‌బాబు, రెవెన్యూ, వ్యవసాయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

జెవివి ఆధ్వర్యంలో మ్యాజిక్ శిక్షణ

అరసవల్లి: జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో యుటిఎఫ్ భవనంలో జెవివి రాష్ట్ర అధ్యక్షులు గొంటి గిరిధర్ ఆధ్వర్యంలో మ్యాజిక్ షో శిక్షణా కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా కాయిన్ మ్యాజిక్, పేపర్ మ్యాజిక్, బాటిల్ మ్యాజిక్, బాల్ మ్యాజిక్, కెమికల్ మ్యాజిక్, రోప్ మ్యాజిక్, వాటర్ మ్యాజిక్, గ్లాస్ మ్యాజిక్, మూఢనమ్మకాల నిర్మూలనపై పాటలు, ప్లాస్టిక్ వాడకం నిషేధంపై గీతాలు ఆలపిస్తూ శిక్షణా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కడపకు చెందిన జెవివి ప్రతినిధి బాయన్న ఆధ్వర్యంలో శిక్షణా కార్య క్రమాలు నిర్వహించారు. విశాఖపట్నం జిల్లా జెవివి ప్రతినిధి మురళీధర్, పార్వతీపురం మన్యం జిల్లా ప్రతి నిధి మహేశ్వరరావు, ప్రభాకర్, కె.శ్రీనివాస్, యుఆర్ ఎస్ నాయుడు, కొత్తకోట అప్పారావు పాల్గొన్నారు.

రట్టినిలో గ్రామసభ

మెళియాపుట్టి: మండలంలోని రట్టినిలో ఉపాధి హామీ పనులపై శనివారం గ్రామసభ నిర్వహించారు. గ్రామంలో రోడ్లు, డ్రైనేజీలు తదితర అవసరాలను గుర్తించి, కొత్తగా చేపట్టాల్సిన పనులపై గ్రామస్తుల అభిప్రాయాలను సేకరించారు. వీటిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని ఎపిఒ రవి చెప్పారు. కార్యక్రమంలో ఇసి ఆదినారాయణ, ఎఎంసి డైరెక్టర్ చింతల ప్రశాంత్, సర్పంచ్ ప్రతినిధి హరిచంద్ర సాములు, ఫీల్డ్ అసిస్టెంట్ లింగరాజు, మెట్లు పాల్గొన్నారు.

రాష్ట్రపతిని కలిసిన చిన్నారులు

ప్రజాశక్తి- రణస్థలం

స్కౌట్స్ అండ్ గైడ్స్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి నలుగు విద్యార్థులకు శుక్రవారం నిర్వహించిన చిల్డ్రన్ డే సెలబ్రేషన్స్‌లో భాగంగా రాష్ట్రపతి భవన్ కల్చరల్ సెంటర్‌లో రాష్ట్రపతి ద్రౌపతి ముర్మును కలిశారు. సెలబ్రేషన్‌లో పాల్గొనుటకు సెక్రటేరియట్, రాష్ట్రపతి భవన్, న్యూ ఢిల్లీ నుంచి ఆహ్వానం వచ్చింది. స్కౌట్స్ అండ్ గైడ్స్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పక్షాన అనకాపల్లి నుంచి ఇద్దరు చిన్నారులు, శ్రీకాకుళం జిల్లా నుంచి ఇద్దరు విద్యార్థులకు అవకాశం వచ్చింది. రణస్థలం మండలంలోని ఐరిస్ సాకల్య స్కూల్ నుంచి ఏడో తరగతి చదువుతున్న కొమనాపల్లి లాస్యశ్రీ, 9వ తరగతి చదువుతున్న నౌకట్ల యశ్వంత్ ఎంపికయ్యారు. పై ఐరిస్ సాకల్య యాజమాన్యం తరపున డైరెక్టర్ కొమనాపల్లి హరికృష్ణ, ఉపాధ్యాయ బృందం, ఐరిస్ తల్లితండ్రులు ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా శనివారం చిన్నారులు మాట్లాడుతూ పెద్దయ్యాక మీరు ఏమి సాధిస్తారని రాష్ట్రపతి అడగ్గా, విద్యార్థులు ఒకరు డాక్టర్, ఒకరు టీచర్‌గా ఈ దేశానికి సేవ చేస్తామని చెప్పామన్నారు. ఆ మాటలకు రాష్ట్రపతి అభినందించారని పేర్కొన్నారు. అలాగే స్కౌట్స్ అండ్ గైడ్స్ వారిని మరెన్నో మంచి కార్యక్రమాలు చేయాలని నలుగురికి ప్రేరణ కలగాలని చెప్పారు. స్కౌట్స్ అండ్ గైడ్స్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం శాఖకు,


చిన్నారులతో మాట్లాడుతున్న రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము

స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులకు రాష్ట్రపతి ప్రశంసించారు. కార్యక్రమంలో స్కౌట్స్ అండ్ గైడ్స్ రాష్ట్ర చైర్మన్ ఎం.సాయి, సెక్రెటరీ బి.సతీష్, ఐరిస్ సాకల్య స్కూల్ నుండి డైరెక్టర్ కొమనాపల్లి హరికృష్ణ పాల్గొన్నారు.

18న ఆర్‌డిఒ కార్యాలయం వద్ద ధర్నా

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

పచ్చని ఉద్దాన ప్రాంతంలో కార్గో ఎయిర్ పోర్టు నిర్మించాలన్న కూటమి ప్రభుత్వం నిర్ణయానికి వ్యతిరేకంగా ఈ నెల 18న పలాస ఆర్‌డిఒ కార్యాలయం వద్ద మహాధర్నా చేస్తున్నామని కార్గో ఎయిర్పోర్ట్ వ్యతిరేక పోరాట కమిటీ అధ్యక్షులు కొమర వాసు, కార్యదర్శి జోగి అప్పారావు కోరారు. ఈ మేరకు మండలంలోని అనకాపల్లి, కొండగుడ్డి, ఒంకులూరు గ్రామాల్లో శనివారం పర్యటించి మహాధర్నా పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అభివృద్ధి పేరుతో పచ్చని చెట్లను తొలిగించి ప్రకృతిని, పర్యావరణాన్ని నాశనం చేయడం, భూములను కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టేడమేనని అన్నారు. ఈ భూములను నమ్ముకొని జీవనోపాధి సాగిస్తున్న లక్షలాది మంది ప్రజలను రోడ్డుపాలు చేయడానికే పాలకులు ఈ విధానాన్ని తీసుకొచ్చారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే అధికారులు సర్వే బృందాలు గ్రామాల్లో పర్యటిస్తుంటే స్థానిక రైతులు


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కమిటీ సభ్యులు

ముక్తకంఠంతో వ్యతిరేకిస్తున్నారని అన్నారు. ఎయిర్ పోర్టు మా ప్రాంతంలో వద్దు అంటూ ఏకగ్రీవంగా తీర్మానం చేసుకున్నారని తెలిపారు. రైతులు, మత్స్యకారుల జీవితాలను దృష్టిలో పెట్టుకోని ప్రభుత్వం తమ ఆలోచన విమరించుకోవాలని కోరారు. కాగా, కార్గో ఎయిర్పోర్టుపై రైతులకు ఉన్న వ్యతిరేకతను చాటుకోవడానికి ఈ మహాధర్నా కార్యక్రమం చేపడుతున్నట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో కార్గో ఎయిర్ పోర్టు వ్యతిరేక పోరాట కమిటీ సభ్యులు, రైతులు కర్రి తిరుపతి, రత్నాల భీమారావు, జి.తుమ్మనాథం, ఎంపల్ల కామేష్, కోదండరావు, తెప్పల కృష్ణారావు పాల్గొన్నారు.

ఎచ్చెర్ల ఎస్ఐ బదిలీ

ఎచ్చెర్ల: స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐగా పనిచేసిన వి.సందీప్ కుమార్ జి.సిగడం మండలానికి బదిలీ అయ్యారు. లావేరు పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐగా పని చేస్తున్న జి.లక్ష్మణరావు ఇక్కడకు వస్తున్నట్లు సమాచారం.

జూనియర్ కళాశాల పరిశీలన

నందిగాం : స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలను శనివారం జిల్లా వృత్తి విద్యాశాఖ అధికారి ఆర్.సురేష్ కుమార్ పరిశీలించారు కాలేజీలోని రికార్డులను, ల్యాబ్ తరగతి గదులు పరిశీలించారు విద్యార్థుల హాజరు గురించి ఆరా తీశారు. వీరితో పాటు ప్రిన్సిపాల్ ఎం.కృష్ణమోహన్ పాల్గొన్నారు.

పోలీస్‌శాఖలో ఎటాచ్‌మెంట్‌లు

శ్రీకాకుళం సిటీ: పోలీస్‌శాఖలో ఉన్నతాధికారులు కొందరు ఎస్ఐలను ఎటాచ్ మెంట్‌లు చేశారు. పనితీరు మెరుగ్గా లేని వారిపై, నేర నియంత్రణ తక్షణ చర్యలు నేపథ్యంలో ఎటామెంట్‌లు అమలు చేసినట్లు సమాచారం. త్వరలో అధికారికంగా బదిలీలు చేయనున్నట్లు సమాచారం. ఎచ్చెర్ల ఎస్ఐ జి.సిగ డాంకు, జి.సిగడాం ఎస్ఐ శ్రీకాకుళం రెండువ పట్టణానికి, లావేరు ఎస్ఐ ఎచ్చెర్లకు ఎటాచ్ చేశారు. లావేరు మండలానికి ఎటువంటి నియామకం చేపట్టలేదు. ప్రస్తుతం ఈ అంశంపై చర్చ జరుగుతుంది. పోలీస్ అధికారులు నేర నియంత్రణపై దృష్టిపెట్టినట్లు సమాచారం.

నేటి నుంచి ఉచిత యోగా శిక్షణ

కోటబొమ్మాళి: నటరాజ్ యోగా సొసైటీ ఆధ్వర్యాన స్థానిక బ్రాడ్లా స్కూల్ ఆవరణలో ఆదివారం నుంచి ఉచిత యోగా శిక్షణ ఇస్తామని యోగా సొసైటీ సభ్యులు మద్ది రామారావు శనివారం తెలిపారు. యోగా ఇన్‌స్ట్రక్టర్ స్వామినాయుడు భోధన, పర్యవేక్షణలో సంపూర్ణ ఉచిత యోగా శిక్షణ ఇస్తామన్నారు. రోజూ ఉదయం 5.45 నుంచి 7 గంటల వరకు 15 రోజుల పాటు శిక్షణ ఉచితంగా ఇస్తామన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

విద్యార్థినికి అభినందనలు

ప్రజాశక్తి- కొత్తూరు

స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం ఎంపిసి చదువుతున్న గుడిమెట్ల ఉమాశ్రీ ఈ నెల 11న నిర్వహించిన జిల్లాస్థాయి యువజనోత్సవ పోటీల్లో ఇంగ్లీష్ పోయెట్రీ రైటింగ్‌లో ద్వితీయ బహుమతి సాధించారు. ఈ సందర్భంగా శనివారం కళాశాల ప్రిన్సిపాల్ జి.ధనుంజయరావు, అధ్యాపకులు అధ్యాపకేతర సిబ్బంది విద్యార్థినికి అభినందనలు తెలియజేశారు.


విద్యార్థులతో బ్యాంకు సిబ్బంది

ఘనంగా డిసిసిబి సహకార వారోత్సవం

కవిటి: డిసిసిబి 72వ సహకార వారోత్సవం మండలంలోని రాజపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఈదుపురం డిసిసి బ్రాంచ్ ఆధ్వర్యాన విద్యార్థులకు వ్యాసరచన పోటీలను నిర్వహించారు. మొత్తం 32 మంది విద్యార్థులు పాల్గొన్న ఈ పోటీల్లో పి.రేష్మ (9వ తరగతి) ప్రథమ బహుమతి, ఎల్.చాందిని (9వ తరగతి) ద్వితీయ బహుమతి, సిహెచ్.శ్రీజ (9వ తరగతి) తృతీయ బహుమతి గెలుపొందారు. విజేతలకు ప్రధానోపాధ్యాయులు, బ్యాంకు మేనేజర్ బహుమతులు అందజేశారు. అనంతరం డిసిసిబి బ్రాంచ్ మేనేజర్ సీది నారాయణరావు, బ్యాంకు సిబ్బంది విద్యార్థులకు పొదుపు ప్రాముఖ్యత, సైబర్ నేరాల నివారణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శివరాంప్రసాద్ పాడి, సూపర్‌వైజర్ జి.నవీన్‌కుమార్, అసిస్టెంట్ మేనేజర్ వినయ్‌కుమార్ పాల్గొన్నారు.

కార్యదర్శుల సంఘం మండల అధ్యక్షునిగా సద్గుణబాబు

ప్రజాశక్తి- పలాస

పంచాయతీ కార్యదర్శుల సంఘం మండల అధ్యక్షునిగా రెంటికోట కార్యదర్శి పి.సద్గుణబాబు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పలాస మండల పరిషత్ కార్యాలయంలో శనివారం మండల కార్యదర్శుల సంఘం ఎన్నిక శనివారం నిర్వహించారు. అధ్యక్షునిగా పి.సద్గుణబాబు, కార్యదర్శిగా ఎన్.సుధాకర్ (తర్లకోట), ఉపాధ్యక్షుడు బమ్మిడి రేవతిపతి (అమలకుడియా), కార్యదర్శి సహాయ ప్రధాన కార్యదర్శి వి.జీవన్ (అల్లుకోల), కోశాధికారిగా జి.ఖగేశ్వరరావు (పెదంచల), ఉప కోశాధికారిగా ఎన్.మీనాకుమారి (చినంచల), గౌరవాధ్యక్షునిగా డి.రవికుమార్ (టెక్కలిపట్నం), గౌరవ సభ్యులుగా సారా అప్పారావు (గురుదాసుపురం), ఎన్.ఆశా (కేదారిపురం)లను ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వీరిని


అభినందిస్తున్న ఎంపిడిఒ వసంతకుమార్

పలాస ఎంపిడిఒ వసంతకుమార్, డిప్యూటీ ఎంపిడిఒ మెట్ట వైకుంఠరావు, ఎఒ అనురాధ, సీనియర్ అసిస్టెంట్ కొర్ల మన్మథరావు అభినందనలు తెలిపారు.


ఆమదాలవలస : బాధితులకు చెక్కును అందజేస్తున్న ప్రమీల

సిఎం సహాయనిధి చెక్కులు అందజేత

ప్రజాశక్తి- బూర్జ


మండలంలోని పలు గ్రామాల్లో అనారోగ్యంతో బాధపడుతున్న కుటుంబాలకు శనివారం సిఎం సహాయనిధి నుంచి వచ్చిన ఆర్థిక సహాయం చెక్కులను ఎమ్మెల్యే కూన రవికుమార్ సతీమణి, మాజీ ఎంపిపి కూన ప్రమీల పంపిణీ చేశారు. మండలంలోని వైకుంతపురం గ్రామానికి చెందిన నాట్ల శశికి రూ.27,900, కొరగాంకు చెందిన గురాన రమేష్‌కు రూ.67,113, లక్కుపురానికి చెందిన శాసపు సత్యనారాయణమ్మకు రూ.41,870, చిన్న లంకాంకు చెందిన నక్క నరసింహమూర్తికి రూ.30,780, వైకుంతపురానికి చెందిన పేడాడ లిఖిత్‌కు రూ.40,350, పిఎల్ దేవిపేట గ్రామానికి చెందిన గొట్టి అప్పలసూరికి రూ.47,340 చెక్కులను ఆయా గ్రామాల లబ్ధిదారుల ఇంటికి వెళ్లి అందజేశారు. అర్హులైన ప్రతీ కుటుంబానికి వైద్య ఖర్చుల నిమిత్తం ఆర్థికసాయం అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆమదాలవలస: అనారోగ్య బాధితులకు సిఎం సహాయనిధి కొండంత అండ అని మాజీ ఎంపిపి కూన ప్రమీల అన్నారు. మండలంలో ఇటీవల అనారోగ్యానికి గురైన బాధిత కుటుంబాలకు వైద్య ఖర్చుల నిమిత్తం సిఎం సహాయనిధి ద్వారా మంజూరైన చెక్కులను ఆమె పంపిణీ చేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు ఎండ అప్పలనాయుడు, సర్పంచ్ చేపేన సత్తిరాజు పాల్గొన్నారు.

ఆయన రచనలు అజరామరం

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

శివానందలహరిని వాసుదేవరావు తన తండ్రి కోదండరామయ్య మార్గదర్శనంలో చదివారు. శివతత్త్వంపై ఆకర్షితుడైన వాసుదేవరావు శంకరుడి రచనలను తెలుగులో అనువాదించాలని సంకల్పించి తండ్రి ప్రేరణతో 1929లో మార్చి 9న మహాశివరాత్రి నాడు శివానంద లహరిని తెనుగీకరించే బృహత్కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఒక సంవత్సరంలోనే 1930 నాటికి పూర్తి చేసినా ఆర్థిక పరిస్థితులు సహకరించక పోవడం వలన ప్రచురణను వాయిదా వేస్తూ వచ్చారు. ఉద్యోగరీత్యా అప్పటి గంజాం జిల్లాలోని టెక్కలిలో పనిచేస్తూ ఉండటం వలన కూడా ప్రచురణకు వీలుపడలేదు. చివరకి తండ్రి ప్రోత్సాహంతో 1935లో ప్రచురణకు ప్రభుత్వ అనుమతి కోరారు. ఆయన విజ్ఞప్తిని పరిశీలించిన చికాకోల్ సబ్ కలెక్టర్ ప్రచురణకు అనుమతి ఇవ్వాల్సిందిగా సిఫార్సు చేశారు. దీనిని ఆమోదిస్తూ గంజాం కలెక్టర్ 990/36 సంఖ్య గల లేఖతో మార్చి 3న అనుమతి మంజూరు చేశారు. ఈ పుస్తకానికి పణ్యాం బలరామ స్వామి ముందుమాట రాశారు. తనను శంకరుని రచనల వైపు ప్రోత్సహించిన తండ్రి కోదండరామయ్యకు ఈ కృతిని అంకితమిచ్చారు.


శివానందలహరిని వాసుదేవరావు

పాఠ్య గ్రంథాలుగా రచనలు

వాసుదేవరావు సంస్కృతం నుంచి తెలుగులోకి అనువదించిన శివానందలహరిని ఆంధ్ర విశ్వ విద్యాలయం వారు ఇంటర్మీడియట్ విద్యార్థులకు 1936 సంవత్సరంలో పాఠ్య గ్రంధంగా నిర్ణయించారు. ఈయన రచించిన సమీర సందేశంను ఆంధ్రప్రదేశ్ ఇంటర్మీడియట్ విద్యా మండలి వారు తెలుగు ఉపవాచకంగా 1968లో నిర్ణయించారు.

ఉప నిషన్మందిరంతో అనుబంధం

వాసుదేవరావు కానుకుర్తివారి వీధిలో నివసించే రోజుల్లో తన నివాసానికి సమీపంలో ఉండే కోదండ రామాలయాన్ని నిత్యం సందర్శిస్తూ ఉండేవారు. 1954వ సంవత్సరంలో ఆలయంలో ఉపనిషన్మందిరాన్ని స్థాపించినపుడు ఆయన అందులో వ్యవస్థాపక సభ్యులు కూడా. ఆయన రచించిన సుందరకాండ, కిష్కింధ కాండలను ప్రచురించిన అనంతరం ఉప నిషన్మందిరం సభ్యులు వాసుదేవరావును ఘనంగా సన్మానించారు. ఆయన రచనలన్నీ ఉప నిషన్మందిరంలో నేటికి లభ్యమవుతున్నాయి.


మృతదేహాన్ని తీసుకొస్తున్న గ్రామస్తులు


చెరువులో పడి ఇంటర్ విద్యార్థి మృతి

సోంపేట: మండలంలోని రుషికుద్ద సమీపంలో ఉన్న చాకలి చెరువుకి స్నానానికి వెళ్లి గ్రామానికి చెందిన ఇంటర్ విద్యార్థి బొడ్డు హర్ష (16) శనివారం మృతి చెందాడు. ఈ మేరకు స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన బొడ్డు ధర్మారావు, లక్ష్మి దంపతులకు హర్షతోపాటు ఎనిమిదో తరగతి చదువుతున్న హారిక అనే కుమార్తె ఉంది. శనివారం కళాశాలకు సెలవు పెట్టిన హర్ష, ఇద్దరి స్నేహితులతో కలిసి గ్రామ సమీపంలోని చాకలి చెరువుకు స్నానానికి వెళ్లాడు. స్నానం చేస్తూ హర్ష చెరువులో మునిగిపోయాడు. మిగిలిన ఇద్దరు గ్రామంలోకి వచ్చి హర్ష చెరువులో మునిగిపోయిన సంగతి తెలియజేశారు. వెంటనే గ్రామస్తులు, కుటుంబ సభ్యులు చెరువులో హర్ష కోసం గాలింపు చేశారు. ఫలితం లేకపోవడంతో సోంపేట అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. లైఫ్ జాకెట్లు, ట్యూబులు సహాయంతో చెరువును గాలింపు చేశారు. చివరికి మత్స్యకారులు ఉపయోగించే వలల సహాయంతో గాలింపు చేపట్టగా హర్ష మతదేహం లభించింది. చేతి కందిన కొడుకు ఇలా విగత జీవిగా మారడంతో తల్లిదండ్రుల రోదన మిన్నంటింది. మృతదేహాన్ని సోంపేట పోస్టుమార్టం నిమిత్తం తరలించి, అనంతరం తల్లిదండ్రులకు అప్పగించారు. సంఘటనపై ఎస్ఐ లవ రాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అందరితో చలాకీగా తిరిగే హర్ష ఆకస్మిక మరణంతో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి.

వరి ఓవులు చోరీ

బూర్జ: తనకు సంబంధించిన 24 సెంట్లు భూమిలో కష్టపడి పండించిన వరి పంట చోరీకి గురైందని లచ్చయ్యపేట గ్రామానికి చెందిన కొంచెం మన్మథరావు వాపోయారు. తాను 24 సెంట్లులో వరి పంటను కోసి ఆరబెడితే గుర్తు తెలియని వ్యక్తులు పట్టుకుపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. కోత కోసి ఓవులను పొలంలో ఉంచి తీర్థయాత్రకు వెళ్లిన సమయంలో వరి మోపులను మాయం చేశారని బాధితుడు వివరించాడు. దీనిపై డయల్ 100 ద్వారా పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

లారీ బోల్తా


బోల్తా పడిన లారీ

పలాస : జాతీయ రహదారి పలాస బైపాస్ రోడ్డు శాసనం కూడలి వద్ద శనివారం లారీ బోల్తా పడింది. అందులోని డ్రైవర్, క్లీనర్లు ప్రాణాపాయం నుంచి తృటిలో తప్పించు కున్నారు. ఎమ్మెల్యే గౌతు శిరీష ఇంటి సమీపంలో బోల్తా పడడంతో పోలీసులు సకాలంలో చేరుకొని లారీని బయటకు తీశారు.

గంజాయితో ఇద్దరు అరెస్టు

నరసన్నపేట: మండలంలో అక్రమంగా గంజాయి తరలిస్తున్న వేర్వేరు కేసుల్లో ఇద్దరిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి 21 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు సిఐ శ్రీనివాసరావు తెలిపారు. నరసన్నపేట సిఐ కార్యాలయంలో శనివారం విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శుక్రవారం రాత్రి ఎస్ఐ దుర్గా ప్రసాద్, పోలీసులు మడపాం టోల్ గేట్ వద్ద వాహనాల తనిఖీలు చేస్తుండగా, ఒకరు రాత్రి 8 గంటలకు, ఇంకొకరు 11 గంటలు సమయంలో పట్టు బడ్డారని తెలిపారు. తపన్‌కుమార్ మహంతి అనే వ్యక్తి ఒడిశా నుంచి చెన్నై 11


మాట్లాడుతున్న సిఐ శ్రీనివాసరావు

కేజీలు గంజాయి తరలిస్తుండగా మార్గంమధ్యంలో టోల్ గేట్ వద్ద పట్టు బడ్డారని అన్నారు. అలాగే త్రిలోచన ముదిలి 10 కేజీల గంజాయిని బెంగళూరు తీసుకుని వెళ్తుండగా పట్టుబడ్డారని తెలిపారు. వారి నుంచి 21 కేజీల గంజాయి, రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వారిపై కేసు నమోదు చేశామన్నారు.

13 కిలోల గంజాయి స్వాధీనం

పలాస: 13 కిలోల గంజాయితో ఒడిశా రాష్ట్రం గజపతి జిల్లా తండిగూడకు చెందిన సపన్ కుమార్ బెబరాతను అరెస్టు చేసి కోర్టుకు హాజరుపరిచినట్లు కాశీబుగ్గ సిఐ పి.సూర్యనారాయణ తెలిపారు. పర్లాకిమిడిలో తారకబారికో అనే వ్యక్తి నుంచి సపన్ కుమార్ బెబరాత గంజాయి రూ.2 వేలుకు కొనగోలు చేసి బస్సులో అక్కడ నుంచి నేరుగా కాశీబుగ్గ చేరుకున్నాడు. అనంతరం బ్యాగుతో పలాస రైల్వేస్టేషన్ రోడ్డులో వెళ్తుండగా... ఎస్ఐ నర్సింహమూర్తి సాధారణ తనిఖీలు చేస్తుండగా ఆయన తారాసపడ్డాడు. అనంతరం పోలీసులను చూసి పారిపోయేందుకు సిద్ధపడగా చాకచక్యంగా పట్టుకొని బ్యాగు పరిశీలించడంతో గంజాయి బయట పడింది. మహారాష్ట్ర రాష్ట్రం షోలాపూర్‌కు చెందిన వ్యాన్ డ్రైవర్ రవి గంగారామ్‌తో పరిచయం ఏర్పడింది. గంజాయి తీసుకొని తనకు అప్పగిస్తే కిలోకు రూ.5వేలు ఇస్తామని చెప్పడంతో తక్కువ సమయంలో ఎక్కువ డబ్బులు పొందవచ్చుని దురాశతో పర్లాకిమిడికి చెందిన తారబారికోను కలుసుకొని గంజాయి అతని నుంచి కొనుగోలు చేసి పట్టుబడ్డాడు.



గ్రామస్తులతో మాట్లాడుతున్న ఆర్‌డిఒ, డిఎస్‌పి

డొంకూరులో 144 సెక్షన్

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

ఇచ్ఛాపురం మండలంలో తీర ప్రాంత గ్రామం డొంకూరులో గత రాత్రి చోటు చేసుకున్న రెండు గ్రూపుల కొట్లాట సందర్భంగా శనివారం పోలీసులు 144 సెక్షన్ విధించారు. రెండు తరగతులకు సంబంధించి సున్నితమైన వ్యవహారం కావడంతో రెవెన్యూ, పోలీస్ అధికారులు అప్రమత్తమయ్యారు. కొన్ని రోజుల కిందట ఆలయ నిర్మాణ విషయంలో నెలకొన్న అభిప్రాయ బేధాలతో వివాదం మొదలైంది. ఆలయం నిర్మాణానికి చందాలు సేకరించగా, ఒక తరగతి చెందిన వారు వ్యతిరేకించారు. వ్యతిరేకించిన గ్రూపులో మత్స్యకారులు వేటకు వెళ్లి తీసుకొచ్చిన సంపదను షెడ్డులో ఉంచగా, రెండో గ్రూపునకు చెందిన అందుకు నిరాకరించి సంపద బయట పారబోసింది. దీంతో ఘర్షణ చోటు చేసుకుంది. ప్రేమ్‌కుమార్, బి.రాజు, బి.సన్నీ, కె.కృష్ణారావు గాయాలయ్యాయి. వీరు ఇచ్ఛాపురం ప్రభుత్వ సామాజిక ఆస్పత్రిలో చికిత్సపొందుతున్నారు. సిఐ చిన్నంనాయుడు బందోబస్తు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆర్‌డిఒ వెంకటేష్, కాశీబుగ్గ డిఎస్‌పి లక్ష్మణరావు, డిటి శ్రీహరి గ్రామానికి వెళ్లి ఇరు గ్రూపులతో మాట్లాడారు. అనంతరం ఇరు గ్రూపుల నుంచి 20 మందికి బైండోవర్ చేశారు. గ్రామంలో ఉద్రిక్తత పరిస్థితులు తలెత్తకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.



పొలంలో ఏర్పాటు చేసిన చీర

వరికి అడవి పందుల బెడద

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

వరి పంట చేతికి అంది వచ్చిన సమయంలో అడవి పందుల బెడదతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మండలంలోని బెండి, సీతాపురం, పెద్దబొడ్డపాడు, కొండవూరు, కూర్మనాథపురం తదితర ప్రాంతాల్లో అడవి పందుల బెడద ఎక్కువగా ఉంది. రాత్రి సమయంలో పంట పొలాలపై పడి పంటలను ధ్వంసం చేస్తున్నాయి. పంట పొలాలు కాపలాకు రాత్రివేళ రైతులు పొలాలకు వెళ్తున్నారు. అయినా అడవి పందులు పంటను ధ్వంసం చేస్తూనే ఉన్నాయి. పంటలను కాపాడుకోవడానికి కొంతమంది రైతులు పొలానికి చుట్టూ చీరలు కడుతున్నారు. రాత్రి సమయంలో ఈ చీరలు మనుషులు సంచారం లా పందులకు కనిపిస్తే దూరంగా వెళ్లిపోతాయని రైతులు చెబుతున్నారు. పంట చేతికి అందుతుంది అనే సమయంలో అడవి పందుల మూలంగా తీవ్రంగా నష్టపోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అటవీశాఖ అధికారులు స్పందించి అడవి పందులు సంచారం అరికట్టడానికి చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

బ్యాంకింగ్ సేవలపై అవగాహన

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

ప్రభుత్వ డిగ్రీ కలశాల ఎన్‌ఎస్‌ఎస్‌విభాగం ఆధ్వర్యాన తెలుకుంచిలో బ్యాంకింగ్ సేవలపై ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు శనివారం అవగాహన కల్పించారు. చిన్నప్పటి నుంచే ఆర్థిక ప్రణాళిక, క్రమశిక్షణ కలిగి ఉండాలన్నారు. ఖర్చులు సేవింగ్స్, బ్యాంకింగ్ విధానాలు గురించి వివరించారు. అనవసర మెసేజెస్ తెరవరాదని, లింక్స్ ఓపెన్ చేయవద్దని సూచించారు. సేవింగ్ విత్ డ్రా ఫార్మ్ నింపే విధానం స్వయం, సహాయక సంఘాల మహిళలకు నేర్పించే ప్రయత్నం చేశారు. అనంతరం స్వచ్ఛతపై ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మెరుగు సూర్యానారాయణరెడ్డి, సర్పంచ్ పి.రాజశేఖర్, ప్రోగ్రామ్ ఆఫీసర్ పాండవ సంతోష్‌కుమార్, కార్యదర్శి హేమలత, అధ్యాపకులు దుర్యోధన, సీతమ్మ, ఈశ్వర్, రాధ, లోకేష్ పాల్గొన్నారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న సిఐ సత్యనారాయణ

భద్రతా ఏర్పాట్లు పరిశీలన

ప్రజాశక్తి- పొందూరు

మండలంలోని కృష్ణాపురంలో గల ఆనంధాశ్రమం 20వ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం నిర్వహించనున్న హిందూదార్మిక సమ్మేళనానికి చేపట్టిన భద్రతా ఏర్పాట్లును శనివారం ఆమదాలవలస సిఐ పి.సత్యనారాయణ పరిశీలించారు. కార్తికమాసం సందర్భంగా ఏటా నాల్గవ ఆదివారం నిర్వహించే ఈ సమ్మేళనానికి పలు జిల్లాల నుంచి వేలాదిమంది తరలివస్తుంటారు. ఈ సందర్భంగా ఆశ్రమం వ్యవస్థాపకులు, ఆంధ్రప్రదేశ్ సాధుపరిషత్ అధ్యక్షులు స్వామి శ్రీనివాసానంద మాట్లాడుతూ దార్మిక సమ్మేళనానికి సుమారు 25 వేలమంది హాజరయ్యే అవకాశం ఉందని సిఐకు తెలియజేశారు. కాశీబుగ్గలోని వెంకటేశ్వర ఆలయంలో చోటుచేసుకున్న తొక్కిసలాట నేపథ్యంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పటిష్ట బందోబస్తును ఏర్పాటు చేయాలని సిఐను ఆయన కోరారు. ఈయనతో పాటు తహశీల్దార్ ఆర్.వెంకటేష్, ఎస్ఐ వి.సత్య నారాయణ, సర్పంచ్ ప్రతినిధి అంబల్ల శ్రీనివాసరావు తదితరులున్నారు.

కూరగాయల నారు పెంపకంపై శిక్షణ

ఆముదాలవలస: పట్టణంలోని కృషి విజ్ఞాన కేంద్రంలో షేడ్‌నెట్లు ఉపయోగించి ప్రో ట్రే విధానం ద్వారా కూరగాయల నారు తయారీపై మూడురోజుల పాటు ప్రత్యేక శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించ నున్నట్లు ఉద్యానవన శాస్త్రవేత్త హరికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిక్షణా కార్యక్రమం ఈ నెల 17 నుంచి 19 వరకు కృషి విజ్ఞాన కేంద్రం ప్రాంగణంలో జరుగనుందని తెలిపారు. ఈ నైపుణ్య ఆధారిత శిక్షణలో ఆసక్తి ఉన్న గిరిజన యువత పాల్గొని తమ సాగు పద్ధతులను మరింత ఆధునీకరించుకోవాలని సూచించారు. షేడ్‌నెట్లలో నాట్లు పెంపకం చేయడం ద్వారా మొక్కల పెరుగుదల వేగవంతమవుతుందని నాణ్యమైన నాట్లు తక్కువ ఖర్చుతో లభిస్తాయని వివరించారు. ఈ శిక్షణా కార్యక్రమంలో ప్రధానంగా షేడ్‌నెట్లలో కూరగాయల నారు తయారీ దశల వివరాలు ప్రాంతానికి అనుగుణంగా నూతన కూరగాయల రకాల ఎంపిక చీడపీడల నియంత్రణకు, శాస్త్రీయ పద్ధతులు కొత్త షేడ్‌నెట్ల ఏర్పాటుకు, సాంకేతిక మార్గదర్శకాలు నాణ్యమైన ప్రో ట్రే మిశ్రణ తయారీ తదితర అంశాలపై శిక్షణ ఉంటుందని తెలిపారు. ఆసక్తిగల గిరిజన యువత తక్షణమే కృషి విజ్ఞాన కేంద్రాన్ని సంప్రదించి తమ పేరు నమోదు చేసుకోవచ్చని తెలిపారు.

వేణుగోపాలపురంలో గ్రామసభ

లావేరు: కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్వమిత్వ కార్యక్రమం ద్వారా గ్రామాల్లోని ప్రజలు నివాస స్థలాలపై పూర్తిహక్కులు కల్పిస్తుందని సద్వినియోగం చేసుకోవాలని టిడిపి నాయకులు మజ్జి రామూర్తి అన్నారు. శనివారం గుమ్మాడం పంచాయతీ వేణుగోపాలపురంలో స్వమిత్వ గ్రామసభ డిప్యూటీ ఎంపిడిఒ పద్మజ అధ్యర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ కార్యక్రమం ద్వారా ప్రజలు తమ నివాస సముదాయాల్లో ఉన్న కాళీ స్థలాలకు ప్రభుత్వం పూర్తిహక్కులు కల్పిస్తుందని, ఇటువంటి అవకాశం ఉన్న వాళ్లు వినియోగించుకోవాలని అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ప్రతినిధి దుర్గాసి ధర్మారావు, కూటమి నాయకులు, సచివాలయం సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

పరిశుభ్రతతోనే ఆరోగ్యాంధ్ర



బూర్జ : ప్రతిజ్ఞ చేస్తున్న గ్రామస్తులు

ప్రజాశక్తి- కవిటి

వ్యక్తిగత పరిశుభ్రతే ఆరోగ్య ఆంధ్ర నిర్మాణానికి పునాదని ఎంఇఒ ధనుంజయ మజ్జి, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కె.సింహాచలం నాయుడు అన్నారు. 'స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర' కార్యక్రమంలో భాగంగా కొత్తపాలెం కెజిబివి, ఇద్దివానిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కవిటి జూనియర్ కళాశాలల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. విద్యార్థులతో పరిసరాల పరిశుభ్రత, మొక్కల నాటకం, ర్యాలీ చేపట్టారు. బాలికల ఆరోగ్యం, వ్యక్తిగత శుభ్రతపై స్థానిక ఆసుపత్రి సిబ్బంది బి.అనిత, బి.బాలాకుమారి, సానా ఫిరదౌష్ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపిడిఒ వరప్రసాద్, ఎఒ శ్రీనివాసరెడ్డి, ఎన్‌ఎస్‌ఎస్ పిఒ జె.పాపారావు, సిబ్బంది జి.విష్ణుమూర్తి, కె.ఉగాదినాయుడు, డి.అనసూయ, బి.శ్రీనుబాబు, డి.రమేష్, ఎల్.ఆనంద్, జనార్ధనరావు, బి.అంజన పాల్గొన్నారు.

బూర్జ: పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే వ్యాధులు దరి చేరవని, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవడం ప్రతిఒక్కరి బాధ్యతని మాజీ సర్పంచ్ సత్యం అన్నారు. మండలంలోని వైకుంతపురం గ్రామంలో స్వచ్ఛ ప్రోగ్రాం నిర్వహించారు. ఆరుబయట మల విసర్జన చేయరాదని, ప్రతిఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

రణస్థలం రూరల్: వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చని ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు అన్నారు. స్వచ్ఛాంధ్రలో భాగంగా మండలంలోని కొండములగాం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో పాల్గొని విద్యార్థులకు అవగాహన కల్పించారు. స్వచ్ఛత ఆవశ్యకతను వివరించి ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ ఈశ్వరరావు, ప్రిన్సిపాల్ జె.విజయలక్ష్మి, కూటమి నాయకులు లంక శ్యామలరావు, దన్నాన సత్తిబాబు, దన్నాన స్వామినాయుడు, దన్నాన చిరంజీవి, అధికారులు, ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎచ్చెర్ల: స్వచ్ఛ ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా ఎచ్చెర్ల పిహెచ్‌సి పరిధిలో అంబేద్కర్ గురుకులం హాస్టల్‌లో విద్యార్థినులకు వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. విద్యార్థినులతో స్వర్ణాంధ్ర ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రాం అధికారి డా రవీంద్ర, వైద్యాధికారి డా ఉషశ్రీ, అంబేద్కర్ గురుకులం ప్రిన్సిపాల్ ఎస్.పద్మజా, బి.లక్ష్మీ, ఆరోగ్య విద్యా బోధకులు నిర్మలా కుమారి, విజయలక్ష్మి, సిహెచ్ఒ రమేష్ బాబు, సిహెచ్ పద్మకుమారి, రామచంద్రరావు, హేమలత, ధనలక్ష్మీ, సాయి మల్లేశ్వరి పాల్గొన్నారు.

నరసన్నపేట : విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని, తద్వారా ఆరోగ్యకరమైన సమాజానికి నాంది పలికే వారవుతారని నరసన్నపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇంఛార్జి ప్రిన్సిపాల్ జే.వదనగిరి అన్నారు. స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా కళాశాలలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. చేతులు శుభ్రం చేసుకోసుకునే విధానాన్ని (హ్యాండ్ వాష్ సెషన్) ప్రత్యేక డెమో ద్వారా అధ్యాపకులు దుగ్గివలస రాంప్రసాద్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం పరిశుభ్రత నిబద్ధత కొరకు ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు శివరాంప్రసాద్, వేణుగోపాలరావు, సోమశేఖర్, డాక్టర్ మల్లేషు, శాంతారావు, హనుమంతు ఆనందరావు పాల్గొన్నారు.

మెళియాపుట్టి : మండలంలోని మసుంధరలో నిర్వహించిన స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో ర్యాలీలు, మొక్కలు నాటారు. కార్యక్రమంలో పిఎసిఎస్ అధ్యక్షులు సలాన మోహనరావు, ఎంపిడిఒ నరసింహ ప్రసాద్ పండా, ఎంఇఒ ఎస్.దేవేంద్రరావు, ఎం.పద్మనాభరావు, ఎపిఒ టి.రవి, ఎపిఎం త్రినాథమ్మ, ఇసి ఆదినారాయణ, సర్పంచ్ సంతోష్, టెక్నికల్ అసిస్టెంట్ నాయుడు పాల్గొన్నారు.



రణస్థలం రూరల్ : మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఈశ్వరరావు



కవిటి : ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

ఇచ్ఛాపురం : ఇచ్ఛాపురం పురపాలక సంఘం పరిధిలో స్వర్ణాంధ్రలో భాగంగా కెజిబివిలో కమిషనర్ రమేష్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులచే స్వచ్ఛ ప్రతిజ్ఞ చేయించారు. బెల్లుపడ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు మానవహారం చేపట్టారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఉపేంద్రకుమార్, కెజిబివి ప్రిన్సిపాల్ శిరీష, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

కోటబొమ్మాళి: విద్యార్థులు పరిశుభ్రత పాటించి ఆరోగ్యం కాపాడుకోవాలని స్థానిక మండల పరిషత్ అభివృద్ధి అధికారి కుప్పిలి ఫణీంద్రకుమార్ అన్నారు. స్వచ్ఛాంధ్రలో భాగంగా నిమ్మాడ వైద్యులు డాక్టర్ జి.సురేష్‌తో కలిసి స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలను సందర్శించి హ్యాండ్‌వాష్, మెనిస్ట్రువల్ హైజిన్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంఇఒ డి.గోవిందరావు పాల్గొన్నారు.

సోంపేట : స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర భాగంగా మూడో స్థానిక సోంపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తహశీల్దార్ అప్పలస్వామి, పంచాయతీ ఇఒ శాంతికుమారిల అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కన్వర్జెన్సీ పద్ధతిలో లైవ్ స్టాక్ గ్రౌండింగ్

ప్రజాశక్తి- మందస

మహిళా సంఘాల వార్షిక రుణ ప్రణాళిక అమలుకు బ్యాంకు, స్త్రీనిధి తదితర రుణాలు మైక్రో క్రెడిట్ ప్లాన్ ప్రకారం కన్వర్జెన్స్ పద్ధతిలో లైవ్ స్టాక్ యూనిట్స్ గ్రౌండింగ్ చేయాలని మండల పశు వైద్యాధికారి దువ్వాడ శ్రీకాంత్ తెలిపారు. మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో ఎపిఎం పైడి కూర్మారావు కన్వర్జెన్స్‌పై శనివారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. మహిళా సంఘాలు ఆదాయాభివృద్ధి కార్యక్రమాల్లో లైవ్ స్టాక్ 692 పాడి ఆవులు, గేదెలు, గొర్రెలు, మేకలు యూనిట్లు గ్రౌండింగ్ చేయాలన్నారు. హరిపురం పశు వైద్యాధికారి కిల్లి ఉమాభారతి మాట్లాడుతూ పాడి ఉత్పత్తి పెరగడానికి మహిళలు మేలు జాతి పశువుల ఎంపికతో పాటు పచ్చగడ్డి పెంపకంపై దృష్టిపెట్టాలన్నారు. కార్యక్రమంలో మండలస్థాయి సిబ్బంది, అకౌంటెంట్లు కళ్యాణి, కృష్ణకుమారి, డేటా ఎంట్రీ ఆపరేటర్ రాజారావు, వెలుగు క్లస్టర్ కో-ఆర్డినేటర్లు తదితరులు పాల్గొన్నారు.

బాలల చట్టాలపై అవగాహన

ప్రజాశక్తి- టెక్కలి

బాలల హక్కులు, చట్టాలపై దత్తత ప్రక్రియపైన ప్రతిఒక్కరూ అవగాహన చేసుకోవడం అవసరమని బాలల రక్షణ జిల్లా విభాగం కౌన్సిలర్ ధర్మాన సీతా రాములు అన్నారు. స్థానిక ఐసిడిఎస్ కార్యాలయం పరిధిలోని అంగన్వాడీలకు కార్యకర్తలకు శనివారం అవగాహనా సదస్సు నిర్వహించారు. ఐసిడిఎస్ పిఒ శతపతి విద్య ఆధ్వర్యాన నిర్వహించిన ఈ కార్యక్రమంలో మాట్లాడుతూ బాల్య వివాహాల నిర్మూలనకు గ్రామ స్థాయిలో ఏర్పాటు చేస్తున్న కమిటీలు అవగాహన చేయా ల్సిన అవసరం ఉందన్నారు. ప్రాజెక్టు కో-డైరెక్టర్ శివాజీ మాట్లాడుతూ హెల్ప్ లైన్ నవంబరుపై ప్రతి ఒక్కరికీ తెలిసి ఉండాలని కోరారు. అంగన్వాడీ సూపర్‌వైజర్లు వైకుంఠరావు, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

అంగన్వాడీ నిర్మాణానికి శంకుస్థాపన

మెళియాపుట్టి: మండలంలోని పరశురాంపురం పంచాయతీ నందవతోవూరులో నూతనంగా మంజూరైన అంగన్వాడీ కేంద్ర భవన నిర్మాణానికి వైస్ ఎంపిపి ఆదినారాయణ శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో బాలల పోషణను మెరుగుపరచేందుకు, అంగన్వాడీ సేవలను అందరికీ మరింత చేరువ చేయడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. కొత్త భవనం నిర్మాణంతో స్థానిక పిల్లలు, మహిళలకు మెరుగైన సేవలు అందనున్నాయని చెప్పారు. సర్పంచ్ తెంబూరు ప్రసాదరావు, సవర శ్రీరాములు, నరేష్, ధర్మారావు, పాపారావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జడ్జి కిషోర్‌బాబు

మహిళల అభ్యున్నతికే చట్టాలు

మందస: సమాజంలో మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలు, మానభంగాలు, వరకట్న వేధింపులు ఇలా అనేక రకాల ఇబ్బందులతో బయటకు కూడా చెప్పుకోలేని బాధలు ఎన్నో ఉన్నాయని, ప్రభుత్వాలు, న్యాయస్థానాలు సమన్వయంతో అనేక చట్టాలు రూపొందించారని జిల్లా న్యాయ అధికారి కిషోర్‌బాబు, బార్ కౌన్సిల్ అధ్యక్షులు శైలేంద్ర అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో అంగన్వాడీ కార్యకర్తలకు అవగాహనా సదస్సు శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళల అభ్యున్నతికి మీకు మీరుగా స్వతహాగా ఎదగాలని, ఇటువంటి అవాంఛనీయ సంఘటనలు మీకు, మీ పరిధిలో జరుగుతున్న పేదలపైన బడుగు బలహీనుల పైన వారిపై సంఘటనలు చోటు చేసుకున్నాయని అన్నారు. వెంటనే స్పందించి మీకు దగ్గరలో న్యాయస్థానాలు పోలీస్టేషన్లు 360 రోజులు కూడా అందుబాటులో ఉంటాయన్నారు. కార్యక్రమంలో బార్ కౌన్సిల్ కమిటీ సభ్యులు కృష్ణంరాజు, ఎంపిడిఒ వెంకటరమణ పాల్గొన్నారు.

63 మందిపై బైండోవర్

సోంపేట: సోంపేట సర్కిల్ పరిధిలోని అనధికార మద్యం దుకాణాలు నిర్వహించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ సిఐ రమణ హెచ్చరించారు. ఇంతవరకు బెల్ట్‌షాప్‌లు నిర్వహించిన వారిపై 43 కేసులు నమోదు చేసి, సుమారు 90 లీటర్ల మద్యాన్ని సీజ్ చేశామని తెలిపారు. గతంలో అనధికార మద్యం దుకాణాలను నడిపిన వారిని, అనుమానితులను స్థానిక తహసీల్దార్ అప్పలస్వామి ఎదుట శనివారం బైండోవర్ చేయించినట్లు తెలిపారు. సోంపేట సర్కిల్లోని సోంపేట, కంచిలి, మందస మండలం తహశీల్దార్ వద్ద 63 మందిని బైండోవర్ చేశామన్నారు. అనధికార మద్యం దుకాణాలపై సమాచారం ఉంటే 14405 నంబరుకు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని, అట్టి వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ప్రిన్సిపాల్‌గా బాధ్యతల స్వీకరణ

ఎచ్చెర్ల: డా. బిఆర్ అంబేద్కర్ విశ్వవిద్యాలయం సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్‌గా డా. కె.స్వప్న వాహిని శనివారం బాధ్యతలు చేపట్టారు. సైన్స్ కాలేజీకు స్వప్న వాహిని మూడో ప్రిన్సిపాల్‌గా మూడేళ్ల పాటు కొనసాగనున్నారు. ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా వర్సిటీ పూర్వ రిజిస్ట్రార్ ఆచార్య పి.సుజాత, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ డా. ఎం.అనురాధ, ఆర్అండ్‌డి డీన్ డా.ఎన్. లోకేశ్వరి, ఎన్‌ఎస్‌ఎస్ కో ఆర్డినేటర్ డి.వనజ తదితరులు ఆమెను అభినందించారు. ప్రిన్సిపాల్‌తో పాటు అకడమిక్ అఫైర్స్ డీన్, రాజభవన్ వర్సిటీ కో-ఆర్డినేటర్‌గా ఆమె సేవలందించనున్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

మెళియాపుట్టి: సిపిఐ న్యూడెమోక్రసీ పార్టీ కేంద్ర కమిటీ ఆధ్వర్యాన ఈ నెల 19న హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ప్రతిఘటన పోరాట నేత, ప్రముఖ విప్లవోద్యమ నాయకుడు కామ్రేడ్ చంద్ర పుల్లారెడ్డి 41వ వర్ధంతి సభను నిర్వహిస్తున్నామని అరుణోదయ సాంస్కృతిక సమైక్య జిల్లా కార్యదర్శి సోమేశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా మండలంలోని ముఖుంద పురంలో శనివారం పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కర్నూలు జిల్లా వెలుగోడులో జన్మించిన కామ్రేడ్ పుల్లారెడ్డి స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొని, తరువాత భారత కమ్యూనిస్టు ఉద్యమంలో కీలకమైన పాత్ర పోషించినట్లు వివరించారు. ఐకమ్స్ జిల్లా నాయకులు, స్థానిక సర్పంచ్ సవర భాస్కరరావు, జిల్లా కన్వీనర్ సవర శ్రీను, ఎస్.మోహన్ పాల్గొన్నారు.

నేడు వన భోజనం

లావేరు: మండల కేంద్రంలోని పాతదుర్గమ్మ గుడి బొడ్డపాడు సమీపంలోని మామిడితోటలో ఆదివారం శ్రీభ్రమరాంబ మల్లన్న దేవాంగ సమైక్య సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కార్తీక వనభోజన కార్యక్రమం నిర్వహించ నున్నట్టు సంఘం కార్యవర్గ సభ్యులు తెలిపారు. కార్యక్ర మానికి సంఘ సభ్యులందరూ హాజరుకావాలని కోరారు.



కోర్టు ఆవరణంలో మొక్కలను నాటుతున్న జడ్జి ఫణికుమార్

పొందూరు కోర్టు సందర్శన

ప్రజాశక్తి- పొందూరు

పొందూరు జ్యుడిషియల్ ఫస్టుక్లాస్ మెజిస్ట్రేట్ కోర్టును శనివారం జిల్లా కోర్టు నాల్గవ అదనపు జిల్లా న్యాయమూర్తి ఎస్.ఎం.ఫణికుమార్ సందర్శించారు. ఈ సందర్భంగా వార్షిక తనిఖీలో భాగంగా కోర్టులో పలు దస్త్రాలను పరిశీలించారు. అలాగే పర్యావరణ పరిరక్షణకు కోర్టు ఆవరణలో స్థానిక జూనియర్ సివిల్ జడ్జి బి.జ్యోత్స్నతో కలిసి పలు రకాల మొక్కలను నాటారు. అనంతరం పొందూరు పైడితల్లి అమ్మవారిని న్యాయమూర్తి సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు కోరుకొండ విజయ్‌కుమార్, మొగదాల రమణరావు, అనకాపల్లి శివకుమార్‌లు ఆయనకు స్వాగతం పలికి దుశ్శాలువతో సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. అలాగే కృష్ణాపురంలోని గల ఆనందాశ్రమం 20వ వార్షికోత్సవం సందర్భంగా ఆశ్రమమం వ్యవస్థాపకులు, ఆంధ్రప్రదేశ్ సాధుపరిషత్ అధ్యక్షులు స్వామి శ్రీనివాసానంద నిర్వహించనున్న హిందూదార్మిక సమ్మేళనం ఆహ్వానం మేరకు ఆశ్రమాన్ని న్యాయమూర్తి సందర్శించారు. కార్యక్రమంలో సర్పంచ్ ప్రతినిధి అంబల్ల శ్రీనివాసరావు, జనసేన నాయకులు గార బాబూరావు తదితరులున్నారు.

హైబ్రిడ్ మునగ సాగుతో లాభాలు

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

హైబ్రిడ్ మునగ సాగుతో లాభాలు ఆర్జించవచ్చునని వెలుగు ఎపిఎం గొడబ ప్రసాదరావు అన్నారు. శనివారం స్థానిక మండల మహిళా సమాఖ్య భవనంలో ఔత్సాహిక మునగ రైతులకు సాగులో అనుసరించాల్సిన విధానాలపై సెర్ప్ ఆధ్వర్యాన శిక్షణ ఇచ్చారు. మునగ నారు పెంపకం, పంట క్షేత్రం ఎంపిక, గుంతలు తవ్వకం, ఎరువులు, తెలుగుళ్ళు, సస్యరక్షణ యాజమాన్యంతో పాటు కొమ్మలు కత్తింపు, పంట కోత, అనంతరం చేయాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. ఇదికాక మునగ పంటలో పోషకాలు, మెడిసిన్ విలువలుపై రైతులకు శిక్షణ ఇచ్చారు. అనంతరం రైతులు లేవనెత్తిన సందేహాలను ఉద్యానవనశాఖ అధికారులు నివృత్తి చేశారు. ఈ సందర్భంగా రైతులకు మునగ విత్తనాలు పంపిణీ చేశారు. కార్య క్రమంలో ఉద్యానవనశాఖ అధికారి శంకరాదాసు, సుజాత, సిసిలు రేణుక, వెంకటరావు, నీలవేణి, హరిప్రియ, ఎఫ్‌పిఒ అకౌంటెంట్ సౌజన్య పాల్గొన్నారు.



మునగ విత్తనాలు పంపిణీ చేస్తున్న ఎపిఎం ప్రసాదరావు



మాట్లాడుతున్న వైద్యులు సాహితీ

రేపట్నుంచి సర్వే

ప్రజాశక్తి- ఆముదాలవలస

జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో నవంబర్ 17 నుంచి 30 వరకు ఎల్‌సిడిసి (లెప్రసి కేస్ డిటెక్షన్ కాంపెయిన్) కార్యక్రమాన్ని జిల్లా వైద్యఆరోగ్య శాఖాధికారి డాక్టర్ బి.అనిత ఆదేశాల మేరకు నిర్వహించనున్నట్లు పిహెచ్‌సి వైద్యులు డాక్టర్ బి.సాహితి తెలిపారు. శనివారం పిహెచ్‌సిలో వైద్యసిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ ప్రజల్లో కుష్టు వ్యాధిపై అవగాహన పెంపొందించడం, ప్రారంభ దశలలోనే వ్యాధిగ్రస్తులను గుర్తించి చికిత్స అందించడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. ఆశా కార్యకర్తలు, ఆరోగ్య శాఖ సిబ్బంది గ్రామాలు, కాలనీలకు వెళ్లి ఇంటింటికి సందర్శించి చర్మంపై స్పర్శలేని తెల్లని లేదా ఎర్రటి మచ్చలు, రంగు మారిన చారలు గల వ్యక్తులను గుర్తించి సమీపంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి రిఫర్ చేస్తారని తెలిపారు. పిహెచ్‌సి వైద్యులు పరిశీలన అనంతరం ఆ మచ్చలు కుష్టు వ్యాధికి సంబంధించినవని నిర్ధారణ అయితే బాధితులకు ఆరు నెలల పాటు ఉచితంగా ఎండిటి (మల్టి డ్రగ్ థెరపీ) చికిత్స అందజేయడం జరుగుతుందన్నారు. ఈ చికిత్స ద్వారా వ్యాధిని పూర్తిగా నయం చేయవచ్చని స్పష్టం చేస్తున్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో పిహెచ్‌సి పరిధిలో పనిచేస్తున్న ఆశా కార్యకర్తలు, ఎఎన్‌ఎం, ఆరోగ్యశాఖ సిబ్బందికి వైద్యులు ప్రత్యేక శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. లెప్రసి లక్షణాలు, గుర్తింపు పద్ధతులు, రిఫరల్ విధానం, ప్రజల్లో వ్యాధిపై ఉన్న అపోహలను నివారించే చర్యలపై శిక్షణలో విపులంగా వివరించారు. ప్రజల్లో కుష్టు వ్యాధిపై అవగాహన పెంచి గుర్తించిన ప్రతి కేసుకు ప్రభుత్వం ఉచిత వైద్యసేవలు అందించేందుకు కట్టుబడి ఉందన్నారు. ఎల్‌సిడిసి కార్యక్రమంలో ప్రజలు చురుకుగా పాల్గొని ఆరోగ్య సిబ్బందికి సహకరించాలని వైద్యులు సూచించారు.

తాగునీటి పన్నుల వసూళ్లపై సమీక్ష

ప్రజాశక్తి- ఆమదాలవలస

మున్సిపాలిటీ పరిధిలో ఇంటి మంచినీటి పన్నుల వసూళ్లను త్వరితగతిన పూర్తి చేయాలని మున్సిపల్ కమిషనర్ తమ్మినేని రవి అన్నారు. శనివారం మున్సిపల్ కార్యాలయంలో వసూళ్లపై సచివాలయ అడ్మిన్ సెక్రటరీలు, ఎమినిటీ సెక్రటరీలు, సచివాలయ నోడల్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ మున్సిపాలిటీలో 2025 - 26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఇంటి పన్నులు, మంచినీటి పన్ను వసూళ్లను వేగవంతం చేయాలన్నారు. పన్నులు వసూళ్ల మున్సిపాలిటీ అభివృద్ధికి కీలకమని, పన్నుల చెల్లింపుల్లో ఆలస్యం జరుగుతున్న ప్రాంతాలను ప్రత్యేకంగా గుర్తించి ఇంటింటికి వెళ్లి సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పిస్తూ పన్నులు వసూళ్లను చేపట్టాలని ఆదేశించారు. సచివాలయాల పరిధిలో పన్నులు వసూళ్ల పురోగతిని రోజువారిగా సమీక్షించి లక్ష్యాలను సమయానుసారం పూర్తి చేయాలని సిబ్బందిని ఆదేశించారు. ప్రజలు స్వచ్ఛందంగా పన్నులు చెల్లించి మున్సిపాలిటీ సేవల అభివృద్ధికి సహకరించాలని కమిషనర్ విజ్ఞప్తి చేశారు. ఈ సమీక్షా సమావేశంలో సచివాలయాల మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహిస్తున్న కమిషనర్ రవి

ఆక్రమణలకు అడ్డుకట్ట

ప్రజాశక్తి- పలాస

కాశీబుగ్గ హుదూద్ కాలనీకి సమీపంలో ఆక్రమణను రెవెన్యూ అధికారులు శనివారం అడ్డుకున్నారు. గుర్తుతెలియని వ్యక్తులు ప్రొక్లెయినర్‌తో హుదూద్ గృహాల ప్రారంభోత్సవం వేసిన శిలాఫలకానికి ఆణించి ఉన్న కొద్దిపాటి భూమిని ఆక్రమించేందుకు యత్నించాడు. స్థానికులు గుర్తించి రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేయడంతో సిబ్బంది వెళ్లి అడ్డుకున్నారు. బాధ్యులపై చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు. ఈ ప్రాంతంలో ఎటువంటి పట్టాలు లేకుండా నివాసాలు వెలసాయి. మండలానికి సంబంధించిన వారు కాకుండా ఇతర మండలాల ప్రజలు పట్టాలు పొంది గృహాలు నిర్మించుకుంటున్నారు. మొత్తం వ్యవహారంపై అధికారులు సమగ్ర దర్యాప్తు చేసి అర్హత ఉన్నవారికి పట్టాలు ఇవ్వాలని స్థానికులు కోరుతున్నారు.



మాట్లాడుతున్న వైసిపి నాయకులు

కృష్ణచైతన్యపై కేసు సరికాదు

నరసన్నపేట: వైద్య విద్యను అభ్యసించిన ఉన్నత విద్యావంతుడు డాక్టర్ ధర్మాన కృష్ణచైతన్యపై పోలీసులు అక్రమ కేసు బనాయించడం సిగ్గుచేటని వైసిపి నాయకులు మండిపడ్డారు. ఈ మేరకు శనివారం పార్టీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ వైఫల్యాలను కృష్ణచైతన్య గట్టిగా ప్రశ్నించి, ప్రజాక్షేత్రంలో నిలదీస్తున్నారని అన్నారు. దీంతో నియోజకవర్గ టిడిపి నాయకుల వెన్నులో వణుకు మొదలైందన్నారు. ఆయన గొంతు నొక్కే ప్రయత్నం టిడిపి చేస్తోందని, ఇందులో భాగంగా పోలీసులను ప్రయోగించి అక్రమ కేసులు బనాయిస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో ఎంపిపి ముద్దాడ భైరాగి నాయుడు, జెడ్‌పిటిసి చింత రామారావు, వైస్ ప్రెసిడెంట్ పాగోటి రాజారావు, సర్పంచ్ బి.శంకర్ పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్‌గా శ్రీనివాసులు

ప్రజాశక్తి- పలాస

పలాస-కాశీబుగ్గ మున్సిపల్ కమిషనర్‌గా ఇ.శ్రీనివాసులు శనివారం పదవి బాధ్యతలు చేపట్టారు. ఈయన గుంటూరు జిల్లా పొన్నూరు మున్సిపాలిటీలో శానిటేషన్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తూ... ఉద్యోగోన్నతిపై ఇక్కడకు వచ్చారు. ఇప్పటి వరకు పనిచేసిన కమిషనర్ ఎన్.రామారావు విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా బదిలీ అయ్యారు. శ్రీనివాసులు మాట్లాడుతూ పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీని అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని తెలిపారు. ఎమ్మెల్యే గౌతు శిరీష, మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు, పాలకవర్గం, అధికారులను సమన్వయం చేసుకుంటూ అభివృద్ధి చేస్తామన్నారు.

మృతుని తల్లికి రూ.8 లక్షల ఎక్స్‌గ్రేషియా

ఇచ్ఛాపురం : మండలంలోని మండపల్లి ఎంపిపి పాఠశాలలతో ఉపాధ్యాయులుగా పనిచేసిన రత్నాకర్ పతి అనారోగ్యం కారణంగా 2021 అక్టోబరులో మతి చెందారు. కారుణ్య నియామకం పొందటానికి ఆ కుటుంబంలో అర్హత కలిగిన వారు ఎవ్వరూ లేకపోవటంతో డిఇఒకు ఎంఇఒలు కె.అప్పారావు, ఉమాశంకర్ నివేదిక పంపించారు. డిఇఒ ఎక్స్‌గ్రేషియా రూ.8 లక్షలు మంజూరు చేస్తూ... ప్రొసీడింగ్స్ పంపించారు. శనివారం మృతిని తల్లి సులోచనా పతికి ఎంఇఒ కార్యాలయం అందజేశారు. కార్యక్రమంలో ఎపిటిఎఫ్ జనరల్ సెక్రటరీ ఉమాశంకర్, ఉపాధ్యాయులు, ఎంఆర్‌సి సిబ్బంది రవికుమార్, కామేష్ తదితరులు పాల్గొన్నారు.

చూపు కోల్పోయిన వృద్ధుడు

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

నేత్ర శస్త్ర చికిత్స విఫలమై ఓ వృద్ధుడు కనుచూపు కోల్పోయాడు. బాధితుడు, కుటుంబీకుల వివరాలు ఇలా ఉన్నాయి. కోటబొమ్మాళి మండలం జర్జంగికి చెందిన వాసి ఎర్రయ్య ఎస్ఐపిలో టెక్కలి జిల్లా ఆస్పత్రిలో రెండుసార్లు ఎడమ కన్నుకు కాటరాక్ట్ శస్త్రచికిత్స చేయించుకున్నారు. నొప్పితో వైద్యులను సంప్రదిస్తే నయమవుతుందన్నారు. విశాఖలోని ఓ ఆస్పత్రిలో పరీక్షిస్తే చూపురాదని తేలింది. ఇది డాక్టర్ల నిర్లక్ష్యమేనని ఆస్పత్రి సూపరింటెండెంట్‌కు శనివారం ఫిర్యాదు చేశారు.

ఆలయాల అభివృద్ధికి విరాళం

కొత్తూరు : మండలంలోని మాకవరానికి చెందిన చెందిన కీర్తిశేషులు కేశవ భార్య సరస్వతమ్మ కుమారులు శేషగిరి, శ్రీలత, టిడిపి రాష్ట్ర బిసి కార్పొరేషన్ డైరెక్టర్ పాత్రుకొండ మోహనరావు, భీమారావు ఆలయాల అభివృద్ధి శనివారం విరాళం అందజేశారు. సిరికొండ వెంకటేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి రూ.20 వేలు, మల్లికార్జున స్వామి ఆలయానికి రూ.20 వేలు, నీలకంఠేశ్వర స్వామి ఆలయానికి రూ.పది వేలు చొప్పున విరాళాలు అందజేశారు.